క్లుప్తంగా

విద్యార్థి హిమతేజకు నేదురుమల్లి అభినందనలు



హిమతేజను అభినందిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

కోట : దుబాయ్‌లో జరిగిన 21వ అంతర్జాతీయ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో విద్యానగర్ ఎన్‌బీకేఆర్ కళాశాల విద్యార్థి వలిపి హిమతేజ 400 రిలే రన్నింగ్‌లో బ్రాంజ్ మెడల్ సాధించాడు. ఈ క్రమంలో హిమతేజను బుధవారం కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అభినందించారు. అంతర్జాతీయ పోటీల్లో రాణిస్తుండడం కళాశాలకు గర్వకారణమన్నారు.

నేడు లింగవరంలో గ్రామసభ

చిల్లకూరు : తీర ప్రాంతంలోని కోస్టల్ కారిడార్ భూ సేకరణపై రైతులతో గురువారం లింగవరం సచివాలయం వద్ద గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ కారిడార్‌లో భాగంగా తమ్మినపట్నం, లింగవరం, గోనుగొడుగు, మన్నేగుంట, పల్లెవానిదిబ్బ, తీగపాళెం, తాళ్లబైట, నడవలవారిపాళెం ,గ్రామాల్లో 914 ఎకరాల భూమిని సేకరిస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగానే 15 రోజులుగా సర్వే చేసి పంటలు సాగు చేస్తున్న రైతుల పేర్లు నమోదు చేసినట్టు తెలిపారు. ఆ వివరాలపై అభ్యంతరాలు ఉంటే గ్రామసభలో తెలియజేయాలని పేర్కొన్నారు. సాగులో ఉన్న ప్రతి రైతూ గ్రామసభకు హాజరుకావాలని, లేకుంటే అభ్యంతరం లేనట్టుగా పరిగణిస్తామని తెలిపారు.

విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించాలి



దక్కిలి: విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈవో-2 జగదీష్

దక్కిలి : విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించాలని ఎంఈవో-2 పి.జగదీష్ సూచించారు. ఆయన బుధవారం లింగసముద్రం దళితవాడ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. రికార్డులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించారు. విద్యార్థులతో పాఠ్యాంశాలను చదివించి వారి సామర్థ్యాలను పరీక్షించారు. మెరుగైన బోధన అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టాలని హెచ్‌ఎంను ఆదేశించారు.

నేరాల నియంత్రణకు కృషి



ఎస్‌ఐ సురేష్‌బాబు

చిల్లకూరు : మండలంలో నేరాల అదుపునకు కృషి చేస్తానని ఎస్‌ఐ సురేష్‌బాబు తెలిపారు. ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ సుధీర్‌కుమార్ ఒంగోలు ప్రాంతానికి బదిలీ అయ్యారు. ఈ క్రమంలో తడ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్‌ఐ సురేష్ బాబు బదిలీపై ఇక్కడికి వచ్చారు.

తాగునీటి పైపులైను పనుల పరిశీలన



తాగునీటి పైపులైను పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో రజనీకాంత్

ఓజిలి: ఓజిలి శివాలయం వద్ద తాగునీటి పైపులైను పనులను బుధవారం ఎంపీడీవో రజనీకాంత్ పరిశీలించారు. తాగునీటి పైపులైన్ వేసే క్రమంలో రెండు వర్గాల మధ్య వివాదం చోటుచేసుకుంది. దీంతో పనులు నిలిచిపోయాయి. గ్రామస్తులు ఫిర్యాదు మేరకు ఎంపీడీవో అక్కడికి చేరుకుని పైపులైనును పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి సిరాజ్‌తో మాట్లాడి తాగునీటి సరఫరా వివరాలు తెలుసుకున్నారు. కొన్ని రోజుల నుంచి తాగునీటికి ముస్లిం కాలనీవాసులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని త్వరతగతిన చర్యలు చేపట్టాలన్నారు. రెండు రోజుల్లో కొత్త పైపులైను వేయించి సమస్య పరిష్కరిస్తామని చెప్పారు. ఈవోపీఆర్డీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని గాయపడిన వ్యక్తి మృతి



రత్నయ్య(ఫైల్)

పెళ్లకూరు : గత నెల 26న బైక్ ఢీకొనడంతో గాయపడి తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న మండలంలోని గంగరాజుకండ్రిగకు చెందిన కుక్క రత్నయ్య(53) బుధవారం మృతి చెందాడు. రత్నయ్య బైక్‌లో గత నెల 26న శ్రీకాళహస్తి నుంచి గంగరాజుకండ్రిగకు వెళుతున్నాడు. మార్గమధ్యంలో నాయుడుపేట నుంచి శ్రీకాళహస్తి వెళుతున్న మరో బైక్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన రత్నయ్యను స్థానికులు 108లో శ్రీకాళహస్తి, అక్కడి నుంచి తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

స్వర్ణముఖి నది కాజ్‌వే పక్కన పడేసిన ఖాళీ కొబ్బరి బొండాలు







తుమ్మూరు సమీపంలో స్వర్ణముఖి నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు

డంపింగ్ యార్డుగా స్వర్ణముఖి

నాయుడుపేట, పెళ్లకూరు, చిట్టమూరు, ఓజిలి మండలాల ప్రజలకు తాగు, సాగునీటికి ప్రధాన వనరు. కొంతమంది కోళ్ల వ్యర్థాలు, ఇళ్ల శిథిలాలను నదిలో వేస్తుండడంతో డంపింగ్ యార్డుగా మారిపోతోంది. అంతేగాక నది కుచించుకుపోవడంతోపాటు నీరు కలుషితమవుతోంది. ప్లాస్టిక్ కవర్లు పేరుకుపోతున్నాయి. అక్రమంగా ఇసుకను తవ్వి తరలిస్తున్నారు. దీంతో భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. ఈ విషయాలు తెలిసినా నాయుడుపేట మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

– నాయుడుపేట టౌన్



నాయుడుపేట వద్ద స్వర్ణముఖి నదిలో పడేసిన వ్యర్థాలు

- నదిలో కోళ్ల వ్యర్థాలు, ఇళ్ల శిథిలాల మట్టి
- ఆగని ఇసుక అక్రమ తవ్వకాలు
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- పట్టించుకోని అధికారులు

నాయుడుపేట పట్టణ పరిధిలోని స్వర్ణముఖి నది వద్ద ఉన్న కాజ్‌వే నుంచి మేనకూరు సెజ్, వెంకటగిరి తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాలు, బస్సులు రాకపోకలు సాగిస్తాయి. నదిలో ఇష్టా రాజ్యంగా కోళ్ల వ్యార్థాలు, ఇళ్ల శిథిలాలు, కొబ్బరి బొండాలను పడేస్తున్నారు. దీంతో డంపింగ్ యార్డుగా మారిపోతోంది. అలాగే ఎల్‌ఏ సాగరం పాత బీడీ కాలనీ, తుమ్మూరు, భీమవరం, అయ్యప్పరెడ్డపాళెం, మూర్తిరెడ్డి పాళెం, తదితర ప్రాంతాల్లో స్వర్ణముఖి నది నుంచి ఇష్టారాజ్యంగా ఇసుకను తవ్వి తరలిస్తున్నారు. భూగర్భ జలాలు అడుగంటుతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుమ్మూరు సమీపంలో పెద్దపెద్ద గుంతలు తవ్వడంతో స్వర్ణముఖి నదిపై ఉన్న బ్రిటీష్ కాలం నాటి బ్రిడ్జిలు ప్రమాదకరంగా మారాయి. నదిలో వేసిన బోర్ల నుంచి నీటిని నాయుడుపేట పట్టణ వాసులకు సరఫరా చేస్తారు. వ్యర్థాలు పడేస్తుండడంతో నీరు కలుషితమయ్యే అవకాశం ఉందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. స్వర్ణముఖి నదిలో వ్యర్థాలు వేయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చైర్ పర్సన్ కటకం దీపిక, కౌన్సిలర్లు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో స్వర్ణముఖి నదిలో కోళ్ల వ్యర్థాలు, శిథిలాలు వేస్తూనే ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నదీ పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేయాలి



స్వర్ణముఖి నదిని కాలుష్య కోరల నుంచి కాపాడుకునేందుకు స్వర్ణముఖి పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేయాలి. వ్యర్థాల వల్ల నీ రు కలుషితమై రోగాలు వస్తాయి. భూగర్భ జలాలు అడుగంటి పంటలకు సాగునీరు అందదు. నది ప్రాముఖ్యతను కూడా కాపా డుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీనికి అందరూ నడుం బిగించాలి. – చదలవాడ కుమార్, నాయవాది, నాయుడుపేట

అధికారులు చర్యలు చేపట్టాలి



స్వర్ణముఖి నది దుస్థితిపై మున్సిపాలిటీతో పాటు సంబంధిత అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి. అధికారులు పట్టించుకోకపోవడంతోనే నదిలో వ్యర్థాలను ఇష్టారాజ్యంగా పడేస్తున్నారు. కొందరు అక్రమార్కులు రాత్రిళ్లు స్వర్ణముఖి నది నుంచి యథేచ్ఛగా ఇసుకను తవ్వి తరలిస్తున్నారు. నదిని పరిరక్షించేలా చూడాలి. – చేవూరి చెంగయ్య, విశ్రాంత ఆర్‌ఐ, నాయుడుపేట

ఎస్టీ కాలనీలో వ్యాధులు వ్యాపిస్తున్నాయి



స్వర్ణముఖి నదిలో పడేస్తున్న వ్యర్థాలు కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. అంతేగాక పందులు ఎక్కువగా ఉంటున్నాయి. దీంతో సమీపంలో కట్టపై ఉన్న ఎస్టీ కాలనీవాసులు వ్యాధుల బారిన పడుతున్నారు. దీనిపై అధికారులు స్పందించాలి. నదిలో పడేసిన వ్యర్థాలను తొలగించి కాలుష్య కోరల్లోంచి కాపాడాలి. – మావిళ్లపాటి మహేష్, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు

వ్యర్థాలు వేయకుండా చర్యలు చేపడతాం



స్వర్ణముఖి నదిలో వ్యర్థాలు వేయకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడతాం. నది వద్ద ప్రతి రోజూ పర్యవేక్షించేలా సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నాం. స్వర్ణముఖి నదిని పరిరక్షించాలని పాలకవర్గం తీర్మానం చేసింది. ఈ క్రమంలో వ్యర్థాలను వేసే వారిపై కేసులు నమోదు చేసేలా పోలీసులకు ఫిర్యాదు చేస్తాం. – ఎం.జనార్దన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్, నాయుడుపేట

ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

నాయుడుపేట టౌన్ : 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ గీతావాణి తెలిపారు. ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పెషల్ సమ్మరి రివిజన్ పేరిట ఈ నెల 20 నుంచి అక్టోబర్ 18 వరకు ఇంటింటికీ వెళ్లి ఓటు హక్కు నమోదును చేపట్టినట్టు తెలిపారు. ఓటరు జాబితాలో కుటుంబ సభ్యుల పేర్లు వరుస క్రమంలో వచ్చేలా సరిచేసుకోవాలని సూచించారు. చిరునామాల మార్పు, చేర్పులు కూడా చేసుకోవచ్చన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం

కోట: మండలంలోని మెట్టుకు చెందిన గిరిజన విద్యార్థిని సౌమ్యకు కోటకు చెందిన శ్రీషిరిడీసాయి అక్షయ సేవా సమితి సభ్యులు రూ.10 వేల సాయం అందించారు. ఆమె విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో ఇంజినీరింగ్‌లో సీటు సాధించింది. శ్రీషిరిడీసాయి అక్షయ సేవా సమితి అధ్యక్షుడు అల్లం రమణయ్య, రమణారెడ్డి పాల్గొన్నారు.

23న ఉపాధి పనులపై గ్రామ సభలు

దక్కిలి/సైదాపురం/బాలాయపల్లి(సైదాపురం)/చిల్లకూరు/సూళ్లూరుపేట రూరల్ : అన్ని గ్రామ పంచాయతీల్లో 23న గ్రామసభలు నిర్వహించాలని దక్కిలి, సైదాపురం, బాలాయ్యపల్లి, సూళ్లూరుపేట ఎంపీడీవోలు ప్రసన్నకుమారి, పురుషోత్తం శివకుమార్, వినీల్, ప్రమీలారాణి, చిల్లకూరు ఉపాధి ఏపీవో గిరి తెలిపారు. వారు బుధవారం ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ గ్రామ సభల్లో గ్రామాలకు అవసరమైన పనులను గుర్తించాలన్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయాల్లో ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలన్నారు.

చిల్డ్రన్ హోమ్‌లో వసతుల కల్పనపై ఆరా



డానియల్ చిల్డ్రన్ హోమ్‌లో వంట గదిని పరిశీలిస్తున్న అధికారులు

చిల్లకూరు : చిల్లకూరులోని డానియల్ చిల్డ్రన్ హోమ్‌లో వసతులపై అధికారులు బుధవారం ఆరా తీశారు. ఇక్కడ ప్రతి ఏటా 40 నుంచి 50 మంది వరకు బాలురు వసతి పొందుతూ సమీపంలోని ఉన్నత పాఠశాల, గూడూరులోని ఐటీఐ కళాశాలలో చదువుకుంటూ ఉంటారు. ఇటీవల పలు వసతి గృహాల్లో వసతులు లేక విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు అధికారులు వసతి గృహాలను పరిశీలిస్తున్నారు. ఇందులో భాగంగా తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంఈవో-2 రవూఫ్, రెవెన్యూ, విద్యాశాఖ సిబ్బంది వసతి గృహాన్ని పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి పిల్లల హాజరును అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలను వార్డెన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. వీఆర్వో గిద్దలూరు రమణయ్య, సీఆర్‌పీ వాసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాల మహానాడు నాయకుల నిరసన



చిట్టమూరులో నిరసన తెలుపుతున్న మాల సామాజిక వర్గ నాయకులు

వెంకటగిరి రూరల్/నాయుడుపేట టౌన్/గూడూరు రూరల్/చిట్టమూరు(చిల్లకూరు) : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బుధవారం చేపట్టిన దేశ వ్యాప్త బంద్‌లో మాల మాహానాడు నాయకులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలను మూసివేయించారు. వెంకటగిరిలోని కాశీపేట సెంటర్ వద్ద నిరసన తెలిపారు. నాయకులు పంజాం ధనుంజయ, కల్లూరు జాన్‌నారి సురేష్, కొల్లేటి పెంచలయ్య మోచర్ల ఆంజనేయులు, కె.రాజేష్, జయకర్, డేవిడ్, సుధాకర్, వెంకటేశ్వర్లు, గోపి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నాయుడుపేటలో ర్యాలీగా పాత బస్టాండు అంబేడ్కర్ విగ్రహం వద్ద చేరుకుని విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు కటకం జయరామయ్య, దారా రవి, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యుడు మావిళ్లపాటి మహేష్, పేర్నాటి రాహుల్, రాయపు శేఖర్, మాజీ ఎంపీటీసీ వంశీ పాల్గొన్నారు. అలాగే గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. మాల మహానాడు కన్వీనర్ చింతల చిరంజీవి, గోను శివకుమార్, అరవ పార్వతయ్య మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ వల్ల దేశంలో ఘర్షణలు చోటు చేసుకుంటాయన్నారు. నాయకులు నాశిన భాస్కర్‌గౌడ్, కేఆర్ దాసరి, హరి, బెంగళూరు కార్తీక్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. చిట్టమూరు మండలంలోని కొత్తగుంట, సోమసముద్రం, చిట్టమూరు గ్రామాల్లో మాల మహానేడు నేతలు నిరసన తెలిపారు. నాయకులు బందిలి శ్రీను, సురేష్, రమేష్, క్రాంతి, చిరు, మురళీ పాల్గొన్నారు.

ఫీల్డు అసిస్టెంట్‌ను తొలగిస్తే ఊరుకోం



నిరసన తెలుపుతున్న మహిళలు

నాయుడుపేట టౌన్ : టీడీపీ నేతల ఒత్తిడికి తలొగ్గి ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగిస్తే ఊరుకోమని మండలంలోని పూడేరు గ్రామానికి చెందిన మహిళలు హెచ్చరించారు. వారు బుధవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. పూడేరు పంచాయతీలో ఎ.సుబ్రమణ్యం 20 ఏళ్ల నుంచి ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. టీడీపీ నేతలు అతన్ని తొలగించి తమకు అనుకూలంగా ఉన్న వ్యక్తిని నియమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. దీంతో పూడేరు పంచాయతీలోని పూడేరు, రామారెడ్డి కండ్రిగ, స్నేహపూరి కాలనీకు చెందిన మహిళలు బుధవారం సాయంత్రం నాయుడుపేట ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అవకతవకలకు పాల్పడకుండా పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగిస్తే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే ఉపాధి పనులకు కూడా రాబోమని పేర్కొన్నారు. అనంతరం ఎంపీడీవో భువనేశ్వర్ శర్మ, ఏపీవో షీలుకు వినతి పత్రాలను అందజేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ పూడేరు ఫీల్డ్ అసిస్టెంట్ విషయమై గ్రామంలో విచారించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

మూఢ నమ్మకాలను తరిమికొట్టాలి



బహుమతులు గెలుపొందిన విద్యార్థులతో జేవీవీ ప్రతినిధులు

గూడూరు రూరల్ : చంద్ర మండలంలోకి మనుషులు వెళుతున్న ఈ సమయంలో కూడా కొంతమంది మూఢ నమ్మకాలతో జీవితాలను నాశనం చేసుకుంటున్నారని జేవీవీ అధ్యక్షుడు వేగూరు రాజేంద్ర తెలిపారు. వాటిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. పట్టణంలోని స్వర్ణాంధ్ర భారతి కళాశాలలో బుధవారం మూఢ నమ్మకాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఆడ పిల్లలను చదివిస్తే కీడు వస్తుందని కొంతమంది భావిస్తుంటారని తెలిపారు. అలాంటి వారికి విద్య ఆవశ్యకతను వివరించాలన్నారు. అనంతరం క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, షీల్డ్‌లు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ నిరంజన్, సంస్థ ప్రతినిధులు నాగరాజు, రామమోహన్, ఆనంద్, సుబ్బారావు, రాధయ్య, రజని, సుమన్, వెంకటేశ్వర్లు, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

26న కృష్ణాష్టమి వేడుకలు

రాపూరు: పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో 26 తేదీన కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఈవో సాగర్‌బాబు తెలిపారు. ఇందులో భాగంగా స్వామి వారికి ఉదయం 9 గంటలకు నవ కలశ స్నపన తిరుమంజనం, సాయంత్రం ఉట్టి మహోత్సవం, రాత్రి శేష వాహనంపై స్వామి, అమ్మ వార్ల క్షేత్రోత్సవం చేపడతామని పేర్కొన్నారు.

ఉపాధి పనులు వేగవంతం

దక్కిలి: ఉపాధిహామీ పనులను వేగవంతం చేయాలని ఏపీవో లక్ష్మీనారాయణ ఆదేశించారు. ఆయన బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ మండలంలో జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ 100 రోజులు పని దినాలు కల్పించాలన్నారు. పనుల్లో అవతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. గిట్టుబాటు వేతనం అందేలా కూలీలకు పనులు చేపించాలని పేర్కొన్నారు. మస్టర్లను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఈసీ దామోదర్‌రాజు, టెక్నికల్ అసిస్టెంట్లు షఫీ, గిరి, సరిత, బీఎఫ్‌టీ శివయ్య పాల్గొన్నారు.

మట్టి పరీక్షలపై అవగాహన

దొరవారిసత్రం : ప్రకృతి వ్యవసాయం చేసే రైతు లు మట్టి పరీక్షల ఆధారంగా ఎరువుల వాడుకుంటే తెగుళ్ల ఉద్ధృతి తగ్గడంతో పాటు ఖర్చులు తగ్గించుకోవచ్చని తిరుపతి జిల్లా వనరుల కేంద్రం ఏవో కేవీ శ్రీనివాస్ తెలిపారు. ఆయన బుధవారం తని యాలి గ్రామంలో రైతులకు అవగాహన కల్పించా రు. ప్రస్తుతం ప్రభుత్వం చిరు ధాన్యాల సాగుకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కార్యక్రమంలో స్థానిక ఏఈఓ జ్యోతిర్మయి, సిబ్బంది పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు

పెళ్లకూరు: మండలంలోని శిరసనంబేడు రాజుపాళెం సమీపంలో ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న గిరిజనులతో ఇటుకల వ్యాపారి రాజయ్య అమానుషంగా ప్రవర్తించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు, రెవెన్యూ అధికారులు బుధవారం పరిశీలించారు. రాజయ్యపై అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

26లోపు ఇంటర్వ్యూలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

సూళ్లూరుపేట : శ్రీసిటీ సెజ్‌లో వున్న బ్లూస్టార్ ఏసీ క్లైమేట్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగాల భర్తీకి ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సూళ్లూరుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎస్‌ఎల్‌బీ శంకరశర్మ తెలిపారు. ఇందులో పాల్గొనేవారు ఈ నెల 26 లోపు దరఖాస్తులు, రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ట్రెనీ ఆపరేటర్స్ పోస్టులకు ఐటీఐ, డిప్లమో, ప్రొడక్షన్ హెల్పర్స్ పోస్టులకు ఇంటర్, డిగ్రీ, డిప్లమా విద్యార్హతలున్న వారు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు స్కిల్ డెవలప్‌మెంట్ కో ఆర్డినేటర్లు సుబ్రమణ్యం శాస్త్రి, డాక్టర్ జీకే ప్రసాద్‌ను సంప్రదించాలని వెల్లడించారు.

ఎయిడ్స్‌తో జాగ్రత్తగా ఉండాలి

వెంకటగిరి రూరల్ : ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండి జాగ్రత్తలు పాటించాలని నవజీవన్ ఆర్గనైజేషన్ సీసీ టీఐ ప్రాజెక్టు మేనేజర్ బాలాజీ తెలిపారు. వెంకటగిరిలోని వైష్ణవి డిగ్రీ కళాశాలలో బుధవారం మీకు తెలుసా అనే అంశంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ హెచ్‌ఐవీ వ్యాప్తి, వ్యాధి నివారణ మార్గాల గురించి వివరించారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపరాదన్నారు. కార్యక్రమంలో నవజీవన్ సంస్థ సభ్యులు కవిత, కల్పన, శిరీష, ఎం.నళిని, అధ్యాపకులు రత్నయ్య, సురేష్, అనూష, విజయ్, సుజిత్ పాల్గొన్నారు.

సస్య రక్షణ చర్యలతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య

దక్కిలి : పంటల సాగులో ముందస్తు సస్య రక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ శాఖ తిరుపతి జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య తెలిపారు. ఆయన బుధవారం తీర్థంపాడులో నిమ్మ, మామిడి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ నిమ్మ, మామిడి తోటలను చీడలు ఆశించిన తర్వాత మందు పిచికారీ చేయడం వల్ల ఖర్చు తప్ప ఫలితం ఉండదన్నారు. చెట్లలో కాయలు బఠాని, లేదా గోళీ సైజులో ఉన్నప్పుడే వ్యవసాయశాఖ అధికారుల సిఫార్సుల మేరకు మందులు పిచికారీ చేయాలన్నారు. ఇఫ్కో జిల్లా మేనేజర్ లక్ష్మీనారాయణ మట్లాడుతూ నానో యూరియా, నానో డీఏపీ ఇఫ్కో సూక్ష్మ పోషకాలు వినియోగాలు, లాభాల గురించి వివరించారు. ఇఫ్కో ఎరువులు కొన్న రైతులకు సంకట హరణ్ బీమా ఉచిత పథకం గురించి తెలియజేశారు. వెంకటగిరి ఉద్యానశాఖ అధికారి ఆనంద్‌రెడ్డి మాట్లాడుతూ పామ్ ఆయిల్ సాగు చేసే రైతులకు ఉద్యానశాఖ అందిస్తున్న రాయితీలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వేణుగోపాల్ రావు, గ్రామ ఉద్యానశాఖ సహాయకులు లక్ష్మీ పాల్గొన్నారు.

వేప సాగుతో పలు ప్రయోజనాలు

వెంకటగిరి రూరల్ : వేప సాగుతో పలు ప్రయోజనాలు ఉన్నాయని కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త బి.గోవిందరాజులు, ఫారెస్ట్ రేంజర్ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఏకే పేడ్ మా కే నామ్, ప్లాంట్ ఫర్ మదర్ క్యాంపెయింగ్‌లో భాగంగా బుధవారం వెంకటగిరి పట్టణంలోని పెరియవరం కృషి విజ్ఞాన కేంద్రంలో వేప మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ వేప విత్తనాలతో కషాయం, పిండి తయారు చేసుకుని పంటల్లో చీడపీడలను నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రాజీవన, విజయశ్రీ, నాగార్జునరెడ్డి, తిరుపాల్, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

భూ సర్వేపై గ్రామసభలో ఉద్రిక్తత

కోట: మండలంలోని తీరప్రాంతం కొత్తపట్నంలో బుధవారం రెవెన్యూ, ఏపీఐఐసీ అధికారులు నిర్వహించిన గ్రామసభలో ఉద్రిక్తత నెలకొంది. కొత్తపట్నం రెవెన్యూలో ప్రభుత్వ భూములపై ఇటీవల అధికారులు సమగ్ర సర్వే చేశారు. నివేదికను తహసీల్దార్ జయజయరావు గ్రామసభలో వివరించారు. అభ్యంతరాలు ఉన్న వారు అర్జీలు ఇవ్వాలని కోరారు. ఈ క్రమంలో ఒక వర్గం వారు గ్రామ సభను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. సర్వే రిపోర్టు తప్పులతడకగా ఉందని ఆరోపించారు. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు ఇరువర్గాల వారితో చర్చించి గ్రామసభ సజావుగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. డీటీ మల్లికార్జున్ రావు, ఎస్‌ఐ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

పోలేరమ్మ హుండీ ఆదాయం రూ.4.30 లక్షలు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట గ్రామ దేవత పోలేరమ్మ ఆలయంలోని హుండీలో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.4,30,988 ఆదాయం వచ్చినట్టు దేవదాయశాఖ గూడూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. గ్రామ పెద్దల సమక్షంలో బుధవారం హుండీలోని కానుకలను లెక్కించినట్టు పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ శ్రావణ శుక్రవారం రోజు అమ్మవారికి అలంకరించిన చీరలను వేలం వేయగా రూ.6,301 వచ్చిందని వివరించారు. మొత్తం నగదును అమ్మణ్ణి పేరుతో ఉన్న బ్యాంక్ ఖాతాలో జమ చేస్తామని వెల్లడించారు. పోలేరమ ఆలయ కమిటీ మాజీ సభ్యులు నల్లబోతుల రామారావు, ఈవో శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో భూమికి జీవం

వెంకటగిరి రూరల్ : ప్రకృతి వ్యవసాయంతో భూములకు జీవం వస్తుందని తిరుపతి వ్యవసాయశాఖ ఏడీఏ భాస్కరయ్య తెలిపారు. పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ అవసరానికి మించి రసాయనిక ఎరువులు వాడడం వల్ల భూమికి మేలు చేసే సూక్ష్మ జీవులు చనిపోతాయని తెలిపారు. కేవీకే ప్రధాన శాస్త్రవేత్త బి గోవిందరాజులు మాట్లాడుతూ పంటల సాగులో వేప, కానుగను వినియోగించడం వల్ల భూమి సారవంతం అయి దిగుబడులు పెరుగుతాయని చెప్పారు. కేవీకే శాస్త్రవేత్తలు రాజీవన, నాగార్జునరెడ్డి, తిరుపాల్, విజయశ్రీ, వ్యవసాయశాఖ అధికారి వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

చిల్లకూరు : మండలంలోని జాతీయ రహదారిపై కోట క్రాస్ రోడ్డు వద్ద బుధవారం బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. నెలబల్లిరెట్టపల్లికి చెందిన సూళ్లూరు చెంగయ్య, పాలిచెర్ల కోటేశ్వరరావు బైక్‌లో కడివేడుకు వెళ్లారు. పనులు ముగించుకుని తిరిగి ఇంటికి బయలుదేరారు. కోట క్రాస్ రోడ్డులో మలుపు తిరుగుతుండగా నాయుడుపేటకు వైపు నుంచి నెల్లూరుకు వెళుతున్న రాపూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ స్థానికులు స్వర్ణా టోల్ ప్లాజా అంబులెన్స్ ద్వారా గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి కోటేశ్వరరావును నెల్లూరు తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డెలివరి డాట్ కామ్ కార్యాలయంలో అగ్ని ప్రమాదం

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ ఎదురుగా ఉన్న డెలివరి డాట్ కామ్ కార్యాలయంలో బుధవారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. ఆన్‌లైన్‌లో బుక్ చేసిన వస్తువులు ఇక్కడికి వస్తాయి. కార్యాలయ సిబ్బంది బుధవారం రాత్రి విధులు ముగించుకుని తాళం వేసి ఇళ్లకు వెళ్లిపోయారు. రాత్రి 10 గంటల ప్రాతంలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. స్థానికులు గుర్తించి అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అగ్రిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే పలు వస్తువులు కాలిపోయాయి. నష్టం ఎంత అనే విషయం కార్యాలయ మేనేజర్ వచ్చి అంచనాలు వేయాల్సి ఉందని సిబ్బంది తెలిపారు.